"అల్లాహ్ మార్గంలో పోరాడి చంపబడేవానికి లేక విజయాన్ని పొందేవానికి మేము తప్పకుండా గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము. అసలు మీరు, నిస్సహాయులైన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లలకొరకు అల్లాహ్ మార్గంలో పోరాడకపోవటానికి కారణం ఏమిటి? బలహీనులవటంచేత అణచబడి, వారు, "మా ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు నీ తరఫు నుండి ఒక సహాయుకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు."

(దివ్యఖుర్‌ఆన్ 4 : 75)

కాబట్టి విశ్వాసులు తమను తాము సంస్కరించుకోడానికి శ్రమించాలని సంఘర్షించాలని ప్రోత్సహిస్తూ, దానితో పాటు సమాజంలో శాంతి న్యాయం స్థాపించడానికి ప్రయత్నించాలని కోరుతుంది. ముస్లిం తన చుట్టు అన్యాయం, అణిచివేతలను చూస్తూ ప్రశాంతంగా ఉండలేడు. దేవుడు సృష్టించిన ప్రతి దానిలోను సమతుల్యం కాపాడ్డానికి ముస్లిములు సామూహికంగా ప్రయత్నించాలని ఇస్లామ్ కోరుతుంది. అయితే, అమాయకుల హత్య అది ఎలాంటి కారణాలవల్ల జరిగినా దివ్యఖుర్‌ఆన్ ఎన్నటికీ సమ్మతించదు. సాధారణ ప్రజలను భయభీతులకు గురిచేసే ఉగ్రవాద కార్యకలాపాలకు జిహాద్ పేరు పెట్టే అవకాశమే లేదు. ఈ ఉగ్రవాద కార్యకలాపాలకు ఇస్లామ్‌కు ఎలాంటి సంబంధమూ లేదు.

## సహన చరిత్ర

ముస్లిములు ఇతరులను బలవంతంగా మతం మార్చారన్న అపవాదును పాశ్చాత్య మేధావులు కూడా నేడు తిరస్కరిస్తున్నారు. ప్రముఖ చరిత్రకారుడు డి లేసి ఓ లేరి ఇలా రాశారు : "చరిత్రలో ఇది స్పష్టంగా ఉంది. కాని, మతోన్మాద ముస్లిములు ప్రపంచంలో జైత్రయాత్రలు చేస్తూ, కరవాలబలంతో పరాజిత జాతులప్రజలను బలవంతంగా మతం మార్చేవారన్న అసంబద్ధమైన కల్పితగాథను చరిత్రకారులు తరచు రాస్తూ వచ్చారు." ఇస్లామ్ ధర్మం బలవంతంగా మతం మార్చడాన్ని వ్యతిరేకిస్తుంది. దివ్యఖుర్‌ఆన్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పింది.

"ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కులనుండి ప్రస్ఫుటం చెయ్యబడింది. ఇక నుండి 'తాగూత్'ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించిన వాడు సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే. (అతడు ఆశ్రయించిన) అల్లాహ్ సర్వమూ వింటాడు, సమస్తమూ తెలిసినవాడు." (దివ్యఖుర్‌ఆన్ 2 : 256)

## ఇస్లామ్ ఉగ్రవాదాన్ని ఖండిస్తుంది

అమాయక ప్రజలను భయభీతులకు గురిచేయడం, ఆస్తులను, భవనాలను ధ్వంసం చేయడం, అమాయకులైన పురుషులు, స్త్రీలు, పిల్లలపై బాంబుదాడులు ఇవన్నీ ఇస్లామ్ ప్రకారం నిషిద్ధమైన ఖండించవలసిన చర్యలు. ఎలాంటి టెర్రరిజానికైనా ఇది వర్తిస్తుంది. ఏ ఇతర టెర్రరిస్టు చర్యలు చేయనంతగా అసంఖ్యాక అమాయకులను చంపడం, గాయపరచడం, నిరాశ్రయులు చేయడం జరిగిన పాశ్చాత్య స్టేట్ టెర్రరిజానికైనా ఇది వర్తిస్తుంది.

ఎవరైనా ముస్లిమ్ వ్యక్తిగతంగా ఏదైనా టెర్రరిస్టు చర్యకు పాల్పడితే ఆ వ్యక్తి తాను అనుసరిస్తున్న ఇస్లామ్ మతసూత్రాలకు వ్యతిరేకంగా వ్యవహ రించిన వాడవుతాడు. అలాంటప్పుడు ముస్లిములందరినీ బాధ్యులు చేయడం సబబా? స్వయంగా ఇస్లామ్ ఇలాంటి చర్యలను ఖండిస్తున్నప్పుడు మొత్తం ముస్లిములను దోషులుగా ఎలా నిలబెడతారు? ముస్లిములు దైవానికి విధేయత చూపే మతాన్ని అనుసరిస్తున్నారు. శాంతి, కరుణ, క్షమాపణల మతాన్ని అనుసరిస్తున్నారు. చాలా మంది ముస్లిములకు ముడిపెడుతున్నట్టు, ముఖ్యంగా మీడియా ముస్లిములకు ముడేసి చూపుతున్నట్లు హింసాత్మక సంఘటనలతో సాధారణ ముస్లిమ్ జనసముదాయానికి ఎలాంటి సంబంధమూ లేదు. ఇస్లామ్ తీవ్రవాద ధర్మం కానే కాదు.

ఎవరైతే ధర్మవిషయంలో మీతో యుద్ధం చేయరో ఇంకా మిమ్మల్ని మీ గృహాల నుండి వెళ్ళగొట్టరో! వారి పట్ల మీరు సత్ప్రవర్తనతో ఇంకా న్యాయంతో వ్యవహరించటాన్ని అల్లాహ్ నిషేధించలేదు. నిశ్చయంగా, అల్లాహ్ న్యాయవర్తనులను ప్రేమిస్తాడు. (ఖుర్‌ఆన్ 60:8)

## ఇస్లామ్ గొప్ప సమైక్య శక్తి

ఇస్లామ్ ఒక జీవన మార్గం. జాతి, ప్రాంత పరిమితులకు అతీతమైన జీవన మార్గం. దివ్యఖుర్‌ఆన్ అనేకసార్లు మనుష్యులందరి ఉమ్మడి ప్రారంభం గురించి పేర్కొంది.

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూ." (దివ్యఖుర్‌ఆన్ 49:13)

ఇస్లామ్‌లో ఉన్న ఈ విశ్వజనీన భావన వల్లనే ఇస్లామ్ ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న మతంగా పేరుపొందింది. అనేక వివాదాలు, విద్వేషాలు, భేదాభిప్రాయాలు వ్యాపించి ఉన్న ప్రపంచంలో, వ్యక్తులు, సంస్థలు, రాజ్యాలు కూడా ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఆశాదీపంగా వెలుగొందుతున్న మతం ఇస్లామ్.

# ఇస్లామ్

## తీవ్రవాద మతం కాదు



" ఒక మానవుణ్ణి చంపినవాడు,
సమస్త మానవులను చంపినట్లే.
ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు,
మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే."

(దివ్యఖుర్‌ఆన్ 5:32)

సంప్రదించండి

ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

IIC

040 - 6832 7832 - Hyderabad

మౌలిక విషయాలు తెలుసుకుందాం

040 - 6832 7832

Toll Free 1800 572 3000

www.discovertruepath.com

You Tube : DiscoverTruePath

# ఇస్లామ్ -

## తీవ్రవాద మతం కాదు

ఇస్లామిక్ టెర్రరిస్టులు, ముస్లిమ్ ఫండమెంటలిస్టులు, ఉగ్రవాదులు, రేడికల్ ఇస్లామిస్టులు... ముస్లిములపైన, ముస్లిము సంస్థలపైన ఇలాంటి ముద్రలు ఇటీవలఎక్కువయ్యాయి.

ఇస్లామ్ గురించి చాలా పరిమితమైన అవగాహన ఉన్నవారిని మీడియాలో వస్తున్న వార్తలు మరింత తప్పుదోవ పట్టిస్తున్నాయి. అత్యంత శాంతియుతమైన, సహనశీలమైన ఈ జీవనమార్గం పట్ల ప్రజల్లో చెడు అభిప్రాయం కలుగజేస్తున్నాయి. మీడియాలో వచ్చే పక్షపాతపూరితమైన కథనాలవల్ల, ఇస్లామ్ గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ పరిస్థితిని ఇస్లామ్ గురించి అవగాహన ప్రచారం చేయడం ద్వారా ఎదుర్కోవచ్చు. అంటే దివ్య ఖుర్‌ఆన్ బోధనల గురించి తెలియజేయడం. దివ్యఖుర్‌ఆన్ అంతిమ దైవగ్రంథము. దీని బోధనలను సరిగా అర్థం చేసుకుంటే ఇస్లామ్ తీవ్రవాదానికి, ఉగ్రవాదానికి పూర్తి విరుద్ధమని తెలుస్తుంది.

# దివ్యఖుర్‌ఆన్‌ను

## ఎలా అపార్థం చేసుకుంటారు?

దివ్యఖుర్‌ఆన్ చదువుతున్నప్పుడు లేదా ప్రవక్త ప్రవచనాలను చదువుతున్నప్పుడు ఏ పరిస్థితుల్లో, ఎలాంటి సందర్భాల్లో, ఏ నేపథ్యంలో చెప్పబడ్డాయన్నది కూడా చూడాలి.

ఇస్లామ్ గురించి అపార్థాలు ప్రచారం చేసేవారికి ఈ క్రింది దివ్యఖుర్‌ఆన్ వాక్యం చాలా ఇష్టమైనది.

"మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడ నుండి పారద్రోలారో, అక్కడి నుండి మీరూ వారిని పారద్రోలండి. చంపటం చెడ్డదే. కాని, ఫిత్నా (పీడన) అంతకంటే చెడ్డది. 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చెయ్యనంత వరకు, మీరూ వారితో యుద్ధం చెయ్యకండి. కాని వారే అక్కడ కయ్యానికి కాలుదువ్వితే, మీరు వారిని చంపటానికి వెనుదీయకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష."
(దివ్యఖుర్‌ఆన్ 2 : 191)

కొన్ని సందర్భాల్లో ఈ వాక్యాన్ని మరింత క్లుప్తంగా, మరింత ప్రమాదకరమైనదిగా ఇలా ఉటంకిస్తారు :

"మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి...."
(దివ్య ఖుర్‌ఆన్ 2 : 191)

ఇక్కడ ఆలోచించవలసిన ప్రశ్న ఏమంటే "ఎవరిని చంపాలి"? ఈ ప్రశ్నకు జవాబు కావాలంటే ఈ వాక్యానికి ముందున్న వాక్యాలు, ఆ తర్వాతి వాక్యాలు కూడా చదవాలి.

మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు.
(దివ్యఖుర్‌ఆన్ 2 : 190)

ఈ వాక్యం ఆత్మరక్షణకు యుద్ధం గురించి చెబుతుంది. (మీతో యుద్ధం చేస్తున్న వారితో..). 2 : 191 తర్వాతి వాక్యం :

"వారు యుద్ధం చేయటం మానుకుంటే (మీరూ మానండి) అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించేవాడూ అనే విషయం తెలుసుకోండి."
(దివ్యఖుర్‌ఆన్ 2:192)

ముస్లిములను వారి ధార్మిక విశ్వాసం కారణంగా ఇండ్ల నుంచి తరిమేసిన కాలంలో ఈ వాక్యాలు అవతరించాయి. వారు పదేళ్ళకు పైబడి దౌర్జన్యాలు, అమానుష అణిచివేతలు సహించారు. చివరకు వలసవెళ్ళవలసి వచ్చింది.

పై వాక్యాలు ప్రవక్త కాలంలో మక్కాకు చెందిన అరబ్బు తెగలను ఉద్దేశించిన వాక్యాలు. ఈ తెగలు ముస్లిములపై దౌర్జన్యాలకు ఒడిగట్టాయి. అంతేకాదు, ముస్లిములు వలసవెళ్ళిన తర్వాత కూడా వారిపై దాడికి పథకాలు వేశాయి. ఇలాంటి సందర్భంలో వచ్చిన దైవ వాక్యాలివి. అలాంటి సందర్భాలకు మాత్రమే వర్తించే వాక్యాలు.

కాబట్టి దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను, వాటి సందర్భం నుంచి వేరు చేసి చూడరాదు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు వివిధ సందర్భాల్లో, వివిధ సమయాల్లో అవతరించాయన్నది గుర్తుంచుకోవాలి. దాదాపు 23 సంవత్సరాల కాలంలో దివ్య ఖుర్‌ఆన్ అవతరించింది. మరో ముఖ్యమైన విషయమేమంటే, దివ్యఖుర్‌ఆన్ అరబీ భాషలో అవతరించింది. ఇతర భాషల్లో అనువాదాల్లో పొరబాట్లు దొర్లే అవకాశాలున్నాయి. అనువాదం పూర్తిగా అసలు గ్రంథంలా ఉండకపోవచ్చు.

# యుద్ధానికి అనుమతి

అణిచివేత, దౌర్జన్యాలపై పోరాడడానికి ఇతర ప్రజలకు ఎంత హక్కు ఉందో ముస్లిములకు కూడా అంతే హక్కు ఉంది. సమాజంలో శాంతిభద్రతలకోసం, అణిచివేతలను నిరోధించడానికి పోరాటాన్ని దివ్యఖుర్‌ఆన్ అనుమతిస్తుంది. ఇది సందర్భాన్ని, పరిస్థితులను బట్టి ఆత్మరక్షణ ప్రధానమైనది కావచ్చు కాకపోవచ్చు. అనేక జీవన విధానాల మాదిరిగానే ఇస్లామ్ కూడా మనుగడ కాపాడుకునే ప్రయత్నాలను ప్రోత్సహిస్తుంది. దాడి జరుగుతున్నప్పుడు కాపాడుకునే ఆత్మరక్షణకు అనుమతిస్తుంది. దివ్య ఖుర్‌ఆన్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పింది.

**"ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయినవారు."**
**(దివ్యఖుర్‌ఆన్ 22:39)**

అయితే, శత్రువు పోరాటాన్ని మానుకున్న ప్పుడు ముస్లిములు కూడా మానుకోవాలని ఖచ్చితంగా ఆదేశించడం జరిగింది.

**"ప్రవక్తా! శత్రువు గనక సంధి శాంతుల వైపు నకు మొగ్గుచూపితే, నీవు కూడా దానికి సిద్ధపడు. అల్లాహ్‌పై భారం వెయ్యి; ఆయనే అంతా వినే వాడూ, అన్నీ తెలిసిన వాడూ."**
**(దివ్యఖుర్‌ఆన్ 8: 61)**

ప్రవక్త సన్నిహిత అనుచరుడు, మొదటి ఖలీఫా అబూబక్ర్ (దైవమాయనతో ప్రసన్నుడవు గాక) యుద్ధనియమాలను క్రింది విధంగా తెలియజేశారు

- యుద్ధరంగంలో మోసాలకు పాల్పడ రాదు.
- చనిపోయిన వారి మృతశరీరాలను ధ్వంసం చేయరాదు.
- సన్మార్గాన్ని తప్పరాదు.
- స్త్రీలను, పిల్లల్ని, వృద్ధుల్ని చంపరాదు.
- చెట్లను ముఖ్యంగా పండ్ల చెట్లను ధ్వంసం చేయరాదు.
- శత్రువులపశువులను ఆహారం కోసం తప్ప చంపరాదు.
- ఆరాధనలకు అంకితమైన వారికి నష్టం కలిగించరాదు.

# జిహాద్‌పై అపోహలు

ఇస్లామ్ గురించి సాధారణంగా చాలా అపార్థాలు ప్రచారంలో ఉన్నాయి. ముఖ్యంగా జిహాద్ విషయంలో మరీ ఎక్కువగా అపార్థాలు, అపోహలు ప్రచారంలో ఉన్నాయి. ముస్లిములు హింసాత్మకంగా వ్యవహరిస్తారని చిత్రీకరించడానికి, కత్తిపట్టి ప్రజలను బలవంతంగా మార్చేసే ఇమేజ్ కోసం జిహాద్ పదాన్ని వాడుకోవడం జరుగుతోంది. క్రూసేడులకాలంలో ఆ తర్వాతి శతాబ్దాల్లోను ఈ ప్రచారం చాలా జోరుగా సాగుతూ వస్తోంది. దురదృష్టవశాత్తు నేటికి కూడా ఈ ప్రచారం కొనసాగుతూనే ఉంది. జిహాద్ అన్న పదం "జహదా" అన్న మూలపదం నుంచి వచ్చింది. జహదా అంటే సంఘర్షించడం అని అర్థం. జిహాద్ అంటే నిఘంటువు ప్రకారం సంఘర్షణ అని మాత్రమే అర్థం. ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగు గాక) జిహాద్ గురించి మాట్లాడుతూ మనిషి తన మనోకాంక్షలతో చేసే సంఘర్షణ అత్యుత్తమ సంఘర్షణగా అభివర్ణించారు. మనిషి జీవనరంగాలన్నింటిలోను ధర్మపరాయణుడిగా, దైవవిధేయుడిగా నడుచుకోడానికి తన మనస్సుతో చేసే అంతర్గత సంఘర్షణ ఇది. జిహాద్ అన్యాయానికి వ్యతిరేకంగా సంఘర్షణను కూడా సూచిస్తుంది. అనేక మతాలమాదిరిగానే ఇస్లామ్ కూడా సాయుధ ఆత్మరక్షణకు అనుమతినిస్తుంది. అణిచివేతలను ప్రతిఘటించడానికి అనుమతిస్తుంది. మనం ఇంతకు ముందు ఖుర్‌ఆన్‌లోని 2 : 190 వాక్యంలో చదివిన మాదిరిగా దౌర్జన్యాలను అడ్డుకునే అనుమతిస్తుంది, కాని దానితో పాటు పరిధులు దాటవద్దని కఠినంగా వారిస్తుంది. యుద్ధపరిస్థితి పరిధులు దాటి వ్యవహరించడానికి సాకు ఎంత మాత్రం కాదు. గుడ్డిగా పగ తీర్చుకోడాన్ని ఇస్లామ్ సమ్మతించదు.

**"(ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది."** (దివ్యఖుర్‌ఆన్ 5 : 8)